




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శుక్రవారం,
అక్టోబరు 10, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-

అక్టోబరు 10, 2025




## హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు కాపీ అందిన తరువాత భవిష్యత్ కార్యాచరణ : మంత్రి పొన్నం ప్రభాకర్



## బీసీలకు రిజర్వేషన్లు అమలు కాకుండా నోటికాడ ముద్ద లాక్కునే ప్రయత్నం చేసారు

42% రిజర్వేషన్లు బీసీలకు ఇస్తాం

ఆ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు: మంత్రి వాకిటి శ్రీహరి

## భారత్‌తో యుద్ధం తప్పదు!

ఈసారి యుద్ధంలో మంచి ఫలితాలు సాధిస్తాం

పాక్ మంత్రి ఖవాజా ఆసిఫ్





# స్థానిక ఎన్నికలకు బ్రేక్

## ఎన్నికల నోటిఫికేషన్‌పై స్టే విధిస్తూ హైకోర్టు ఆదేశాలు

- 4వారాల్లో కౌంటర్ వేయాలని ప్రభుత్వానికి ఆదేశం
- ఆ తర్వాత 2 వారాల్లో రిప్లై కౌంటర్ వేయాలని పిటిషనర్లకు స్పష్టీకరణ
- అప్పటివరకు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ నిలిపివేత
- అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏజీ వాదనలు
- సర్వే నుంచి బిల్లు వరకు ఏకగ్రీవ ఆమోదంతోనే జరిగాయి
- ఎక్కడా.. ఏ రాజకీయ పార్టీ నుంచి వ్యతిరేకత రాలేదు
- ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేశాం.. జోక్యం సరికాదు
- ఎలాంటి మధ్యంతర ఉత్తర్వుల జారీ వద్దని విజ్ఞప్తి

హైదరాబాద్: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు హైకోర్టు బ్రేకులు వేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీచేసిన నోటిఫికేషన్‌ను గురువారం సాయంత్రం హైకోర్టు నిలిపివేసింది. నాలుగు వారాల్లో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆ తర్వాత మరో రెండు వారాల్లో రిప్లై కౌంటర్ వేయాలని పిటిషనర్లకు స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. అప్పటివరకు ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలిపివేస్తున్నట్లు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. రెండురోజులపాటు ఇరుపక్షాల నుంచి సుదీర్ఘ వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి (సీజే) ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. నోటిఫికేషన్ నిలిపివేయటానికి గల కారణాలతో కాపీ వెలువరిస్తామని పేర్కొంది. స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 9ని సవాల్ చేస్తూ దాఖలైన అన్ని పిటిషన్లను విచారణకు అనుమతిస్తున్నామని ధర్మాసనం చెప్పింది. జీవో 9ని కొట్టివేయాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవాపూర్ గ్రామానికి చెందిన బుట్టెంగారి మాధవరెడ్డితో పాటు మరికొందరు పిటిషన్లు దాఖలు చేశారు. అలాగే మరో ప్రజాప్రయోజన వ్యాజ్యం కూడా దాఖలైంది. ఈ పిటిషన్లలో తమ వాదనలూ వినాలని కోరుతూ

(మిగతా 2వ పేజీలో)



## సుంకాలు, నిబంధనలు ఆందోళనకరం

### అమెరికా నిర్ణయాలు, విధానాలు సానుకూల దృక్పథంతో ఉండాలి

### ఆర్థికాభివృద్ధి విధానాలే ప్రపంచానికి ఆదర్శనీయం

### అమెరికా ప్రతినిధుల బృందంతో భేటీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: అమెరికా ప్రభుత్వం తీసుకొనే నిర్ణయా లు, అనుసరించే విధానాలన్నీ సానుకూల దృక్పథంతో ఇరుదేశాల మధ్య సంబంధాలను మరింత పెంపొందించేలా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. భార తీయ ఉత్పత్తులపై అమెరికా సుంకాలు పెంచడం, హెచ్- 1బీ వీసాలపై కఠిన నిబంధనలు విధించడంపట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి నిర్ణయాలు ఆర్థిక వ్యవ స్థపై ప్రతికూల ప్రభావం చూపడంతోపాటు అస్థిరతకు, అపార్థానికి దారితీస్తాయన్నారు. ఇరుదేశాల మధ్య ఆర్థికా భివృద్ధికి దోహ దపడే విధానాలు అనుసరిస్తే ప్రపంచానికి ఆదర్శవంతంగా ఉంటుందన్నారు. అమెరికా నుంచి వచ్చిన ప్రతినిధుల బృందం తెలంగాణ పర్యటనలో భాగంగా గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డితో సమావేశమైంది. అమెరికాలోని హడ్సన్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన 16 మంది ప్రతినిధులు ఈ బృందంలో ఉండగా వారిలో మేధావులు, బిజినెస్ లీడర్లు ఉన్నారు. ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ బృందం పలు రాష్ట్రాల్లో పర్యటిస్తూ ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వ్యాపార, వాణిజ్య వ్యవహారాలు, విధానాలపై అభిప్రాయాలు స్వీకరిస్తోంది. ఈ సమావేశంలో సీఎం మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. పాలకులు మారితే విధానాలు మార్చుకోవాల్సిన అవసరం లేదని.. రాష్ట్ర అభి వృద్ధి విషయంలో ఉత్తమ విధానాలను ప్రభుత్వం ఇప్పటికీ కొనసాగిస్తోందన్నారు. జీఎస్డీపీ, తలసరి ఆదాయంలో తెలంగాణ



## భగ్గుమన్న బీసీ సంఘాలు

నోటికాడి కూడు లాగేశారంటూ ఆగ్రహం

బంద్ నిర్వహించి రాష్ట్రాన్ని స్తంభింపచేస్తాం: ఆర్.కృష్ణయ్య

రాజకీయ పార్టీలు డ్రామాలాడుతున్నాయి: జాజుల

## కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య ఫలితం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే

### రాజకీయ స్వలాభం కోసం బీసీల హక్కులను పణంగా పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం

### హైకోర్టు స్టేకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం -వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లాలి

### బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు



హైదరాబాద్ అక్టోబర్ 9 : బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9పై తెలంగాణ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడంతో బీసీ రిజర్వేషన్లపై స్టే విధించడం పట్ల.. కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించాల్సి ఉంటుందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన,.. చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించిన కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే ఈరోజు ఓబీసీలు ఎదుర్కొంటున్న దురవస్థకు కారణమని తెలిపారు. బీసీలకు న్యాయం జరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లి, న్యాయపరమైన లొసుగులను సరిచేసుకోవాలని బిజెపి డిమాండ్ చేస్తోందని ఆయన తెలిపారు.ఆగస్టు 31న అసెంబ్లీ ఆమోదించిన బిల్లును గవర్నర్‌కు పంపినప్పటికీ, గవర్నర్ నిర్ణయం తీసుకోవడానికి ఉన్న మూడు నెలల గడువు ముగియకముందే ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిందని విమర్శించారు. దేశ అత్యున్నత న్యాయస్థానం గవర్నర్‌కు పంపిన బిల్లులపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, ఆ గడువు పూర్తికాకముందే ప్రభుత్వం తొందరపడి ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు.బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా రాజకీయ ప్రయోజనాల కోసమే వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించి చట్టపరమైన లొసుగులను సరిదిద్దుకోవాలని ఆయన సూచించారు. ప్రతీ అంశాన్ని

(మిగతా 2వ పేజీలో)



## ఆ దగ్గు సిరప్‌లను ఉపసంహరించాం

వాటి ఉత్పత్తిని ఆపివేయాలని ఆదేశించాం

అవేవీ విదేశాలకు ఎగుమతి కాలేదు

ప్రపంచ ఆరోగ్య సంస్థకు తెలిపిన సీడీఎస్‌సీవో

# స్థానిక ఎన్నికలకు బ్రేక్

కాంగ్రెస్ సహా కొందరు బీసీ నాయకులు దాదాపు 30 మంది ఇంప్లీడయ్యారు. ఈ పిటిషన్లపై సీజే జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం బుధవారం వాదనలు విన్నది. తిరిగి గురువారం మధ్యాహ్నం 2.15 గంటలకు మరోసారి విచారణ చేపట్టింది.



### అన్ని పార్టీల ఏకగ్రీవ నిర్ణయం..

ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. బీసీ రిజర్వేషన్లను ప్రభుత్వం ఎందుకు పెంచాల్సి వచ్చిందో స్పష్టంగా వివరించారు. 'రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం సామాజిక ఆర్థిక సర్వే నిర్వహించింది. అందులో 98 శాతం మంది పాల్గొన్నారు. సర్వే తర్వాత 57.6 శాతం బీసీ జనాభా ఉన్నట్లు గణాంకాలు తేల్చాయి. దీనిపై నియామకమైన వన్‌మ్యాన్ కమిటీ పూర్తిగా పరిశీలించి ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని సిఫార్సు చేసింది. ఆ మేరకు రిజర్వేషన్లను పెంచుతూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీచేసి, అసెంబ్లీలో పెట్టి ఏకగ్రీవంగా ఆమోదించింది. మార్చిలో ఈ ఆర్డినెన్స్‌ను గవర్నర్‌కు పంపింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు వీలుగా.. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం%–%2018లోని సెక్షన్ 265(ఏ) సవరణకు రూపొందించిన ఆర్డినెన్స్ ముసాయిదాను జూలైలో గవర్నర్ ఆమోదం కోసం పంపించింది. ఆగస్టులో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సవరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆ బిల్లును కూడా గవర్నర్‌కు పంపగా.. ఇవన్నీ అక్కడ పెండింగ్‌లో ఉన్నాయి. గడువులోగా గవర్నర్ ఆమోదం తెలపకుంటే చట్టంగా భావించాలని సుప్రీంకోర్టు ఇటీవలే స్పష్టం చేసింది. సర్వే, రిజర్వేషన్ల పెంపు, బిల్లుపై ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా వ్యతిరేకత వ్యక్తం చేయలేదు'అని వివరించారు. సర్వేలో బీసీల శాతమేనా.. ఎస్సీ, ఎస్టీల జనాభా శాతాన్ని కూడా తేల్చారా? అని ధర్మాసనం ప్రశ్నించగా, అన్ని వర్గాలకు సంబంధించి ప్రభుత్వం సర్వే చేసిందని తెలిపారు.

### వెనుకబాటుతనాన్ని పోగొట్టేందుకే..

బీసీల్లో రాజకీయ వెనుకబాటుతనాన్ని గుర్తించే ప్రభుత్వం రిజర్వేషన్ల పెంపు నిర్ణయం తీసుకుందని ఏజీ తెలిపారు. 'అధిక జనాభా ఉన్న వర్గాలకు పల్లెల్లో అధికారమిస్తే వారు లబ్ధిపొంది రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేస్తుంది. ఇందిరా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఇక్కడ వర్తించదు. విద్య, ఉద్యోగ రంగాలకు సంబంధించి మాత్రమే ఆ తీర్పు అమలవుతుంది. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లపై ఎలాంటి పరిమితి విధించలేదు. తమిళనాడు ప్రభుత్వం, సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఆర్డినెన్స్ జారీచేసిన తర్వాత మళ్లీ నోటీపై చేయాల్సిన అవసరం లేదు. అసెంబ్లీ చేసిన చట్టానికి సూత్రప్రాయ ఆమోదం ఉంది. ప్రజామోదం మేరకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అడ్డుకోవద్దు. ఎన్నికల కమిషన్ స్థానిక సంస్థలకు నోటిఫికేషన్ జారీ చేసింది (నోటిఫికేషన్ ప్రతులను సమర్పించారు). ఒకసారి నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత అడ్డుకోవడం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధం. ఈసీ అధికారాల్లో న్యాయస్థానం జోక్యం చేసుకోవడం సరికాదు. ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవద్దు'అని విజ్ఞప్తి చేశారు.

### 15 శాతం కులాలకు 33 శాతం ఓపెన్ కేటగిరీ ఉంటుంది...

ప్రభుత్వం తరఫున మరో న్యాయవాది రవివర్మ వాదనలు వినిపిస్తూ.. ఎంఆర్ బాలాజీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మైసూర్ కేసును ప్రస్తావించారు. 'పిటిషనర్లకు రిజర్వేషన్లను సవాల్ చేస్తే ప్రాథమిక హక్కు లేదు. ఓటు వేయడం, ఎన్నికల్లో పోటీ చేయడం ప్రాథమిక హక్కు కాదు. రాజ్యాంగంలో రిజర్వేషన్లపై ఎక్కడా 50 శాతం సీలింగ్ లేదు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలు కలిపి 85 శాతం జనాభా ఉన్నారు. ఈ 85 శాతం జనాభాకు 67 శాతం మాత్రమే రిజర్వేషన్లు ఇస్తున్నారు. 15 శాతం ఉన్న ఇతర కులాలకు 33 శాతం ఓపెన్ కేటగిరీ ఉంటుంది. ఈ రిజర్వేషన్లతో ఫార్వర్డ్ కులాలకు వచ్చే నష్టం లేదు. పిటిషనర్లకు పిటిషన్లు వేసే అర్హత లేదు. వాటిని కొట్టివేయాలి'అని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఈసీ జారీచేసిన నోటిఫికేషన్‌పై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. కాగా, హైకోర్టు ధర్మాసనం ఇన్‌ఫ్యూన్డ్ నోటిఫికేషన్‌పై స్టే అని చెప్పడటంతో దేన్ని నిలిపివేశారనేదానిపై సందిగ్ధం నెలకొంది. అధికారిక ఉత్తర్వుల కాపీ వస్తేగానీ కోర్టు ఆదేశాలపై స్పష్టత రానుంది.

# సుంకాలు, నిబంధనలు ఆందోళనకరం

హెచ్- 1బీ వీసాలపై కఠిన నిబంధనలు విధించడంపట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి నిర్ణయాలు ఆర్థిక వ్యవ స్థపై ప్రతికూల ప్రభావం చూపడంతోపాటు అస్థిరతకు, అపార్థానికి దారితీస్తాయన్నారు. ఇరుదేశాల మధ్య ఆర్థికా భివృద్ధికి దోహ దపడే విధానాలు అనుసరిస్తే ప్రపంచానికి ఆదర్శవంతంగా ఉంటుందన్నారు. అమెరికా నుంచి వచ్చిన ప్రతినిధుల బృందం తెలంగాణ పర్యటనలో భాగంగా గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డితో సమావేశమైంది. అమెరికాలోని హడ్సన్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన 16 మంది ప్రతినిధులు ఈ బృందంలో ఉండగా వారిలో మేధావులు, బిజినెస్ లీడర్లు ఉన్నారు. ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ బృందం పలు రాష్ట్రాల్లో పర్యటిస్తూ ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వ్యాపార, వాణిజ్య వ్యవహారాలు, విధానాలపై అభిప్రాయాలు స్వీకరిస్తోంది. ఈ సమావేశంలో సీఎం మాట్లాడుతూ తెలంగాణ రైజింగ్ భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. పాలకులు మారితే విధానాలు మార్చుకోవాల్సిన అవసరం లేదని.. రాష్ట్ర అభి వృద్ధి విషయంలో ఉత్తమ విధానాలను ప్రభుత్వం ఇప్పటికీ కొనసాగిస్తోందన్నారు. జీఎస్డీపీ, తలసరి ఆదాయంలో తెలంగాణ అనూహ్య పురోగతి సాధించిందని.. 2034 నాటి కి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిది ద్దుతూ అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.



### న్యూయార్క్, టోక్యోకి పోటీగా హైదరాబాద్

ఐటీ, ఫార్మా రంగాల పెట్టుబడులకు గ మ్యస్థానంగా హైదరా బాద్ అందరినీ ఆకర్షి స్తోందని.. ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఇక్క డికి వస్తున్నాయని సీఎం రేవంత్ చెప్పారు. హైదరాబాద్ ఇప్పుడు న్యూయార్క్, టోక్యో, దక్షిణ కొరియాతో పోటీపడు తోందన్నారు. హైదరాబాద్‌లో గేమ్-ఛేంజర్ ప్రాజెక్టులుగా భారత్ ఫ్యూచర్ సిటీతోపాటు రీజనల్ రింగ్‌రోడ్, రీజనల్ రింగ్ రైల్, మాన్యు ఫాక్చరింగ్ జోన్లు, మెట్రో విస్తరణ, మూసీ సుందరీకరణ చేపడుతున్నట్లు వివరించారు. హైదరాబాద్ - చెన్నై, హైదరాబాద్-బెంగళూరు మధ్య బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదనలు కూడా ఉన్నాయన్నారు.

### 500 ఫార్చ్యూన్ కంపెనీలు రావాలి

30 వేల ఎకరాల్లో హైదరాబాద్‌లో అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో అమెరికా పరిశ్రమల భాగస్వా మ్యాన్ని ఆహ్వా నిస్తున్నామని సీఎం రేవంత్ అన్నారు. ఇప్ప టికే ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో 50 కంపె నీలు హైదరాబాద్‌లో ఉన్నాయని.. మొత్తం 500 కంపెనీలూ పెట్టుబడులకు ముందు కొచ్చి ఫ్యూచర్ సిటీలో పాలుపంచుకోవాలని ఆకాంక్షించారు. 'చైనా౦1' వ్యూహానికి తెలం గాణ అత్యుత్తమ ప్రత్యామ్నాయంగా నిలు స్తుందని.. అటువంటి భవిష్యత్తు ప్రణాళి కలను తమ ప్రభుత్వం అనుసరిస్తోందని పేర్కొన్నారు. సమావేశంలో మంత్రి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి. సీఎస్ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్

మధ్య ద్వైపాక్షిక సంబంధాలతోపాటు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. వేర్వేరు రంగాల్లో సంబంధాలు మరింత బలోపేతం చేసుకోవాలని, కలిసికట్టుగా పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ఉక్రెయిన్%–%రష్యా యుద్ధం సహా ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. భారత్%–%యూకే మధ్య ప్రతినిధుల స్థాయి చర్చలు సైతం జరిగాయి. మోదీతో భేటీ అనంతరం స్టార్మర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. రష్యా నుంచి ముడిచమురు కొనుగోలుపై మోదీతో చర్చించానని తెలిపారు. ఉక్రెయిన్%–%రష్యా యుద్ధం త్వరగా ముగిసిపోవాలని కోరుకుంటున్నామని, అందుకోసం తమ వంతు ప్రయత్నాలు కొనసాగిస్తామని వెల్లడించారు. భారత్, యూకే మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో అద్భుతమైన ఫలితాలు రాబోతున్నాయని స్పష్టంచేశారు.

### భాగస్వామ్యమే మూలస్తంభం: మోదీ

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ప్రస్తుత అనిశ్చిత పరిస్థితుల్లో ప్రపంచ స్థిరత్వం, ఆర్థిక ప్రగతికి భారత్%–%యూకే భాగస్వామ్యం ఒక మూలస్తంభంగా నిలుస్తోందని భారత ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. భారత్, యూకేలు సహజ మిత్రదేశాలు, భాగస్వామ్య పక్షాలని పునరుద్ఘాటించారు. ప్రజాస్వామ్య విలువలు, స్వేచ్ఛ, చట్టబద్ధపాలన అనే పునాదిపై రెండు దేశాల బంధం నిర్మితమైందని అన్నారు. నైపుణ్యం, సాంకేతికతలే చోదకశక్తిగా యూకేతో భాగస్వామ్యం నానాటికీ బలపడుతోందని హర్షం వ్యక్తంచేశారు. ఇరుదేశాల ప్రజలకు ఉజ్వలమైన భవిష్యత్తును అందించడమే ధ్యేయంగా ఉమ్మడిగా కృషి చేయడానికి కట్టుబడి ఉన్నామని తేల్చిచెప్పారు. కీర్ స్టార్మర్‌తో సమావేశమైన తర్వాత మోదీ మీడియాతో మాట్లాడారు. అరుదైన ఖనిజాల విషయంలో సహకరించుకోవడానికి ఇండస్ట్రీ గిల్డ్, సప్లై చైన్ అబ్జర్వేటరీని ఏర్పాటు చేయాలని తాము నిర్ణయించినట్లు తెలిపారు. ధన్‌బాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్‌లో శాటిలైట్ క్యాంపస్ నెలకొల్పనున్నట్లు వివరించారు. అంతేకాకుండా వాతావరణం, సాంకేతికత, కృత్రిమ మేధ(ఏఐ)లో పరిశోధనల కోసం క్లైమేట్ టెక్నాలజీ స్టార్టప్ ఫండ్ ఏర్పాటు చేయబోతున్నామని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో తీవ్రవాదానికి తావులేదని మోదీ తేల్చిచెప్పారు. యూకేలో ఖలిస్తాన్ తీవ్రవాదుల కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని కీర్ స్టార్మర్‌కు విజ్ఞప్తి చేశారు.

# భగ్గుమన్న బీసీ సంఘాలు

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై గురువారం హైకోర్టు స్టే విధించడం పట్ల బీసీ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. రాష్ట్రంలోని వెనుకబడిన తరగతులకు నోటివరకు అందిన కూడును లాగేశారంటూ మండిపడ్డాయి. స్టే విధిస్తూ తీర్పు ఇచ్చిన వెంటనే హైకోర్టు ప్రాంగణంలో బీసీ సంఘాల నేతలు అన్యాయం జరిగిందంటూ నినాదాలు చేశారు. ప్రధాన పార్టీలపై తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈరోజు రాష్ట్రంలోని బీసీలకు తీవ్ర అన్యాయం జరిగింది. జీవో ఇచ్చిన వెంటనే కోర్టులో పిటిషన్ వేసినప్పుడు అదేరోజు స్టే ఇవ్వాల్సింది. కానీ అన్ని వర్గాల వాదనలు విన్న తర్వాత... చివరకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి నామినేషన్లు సమర్పించిన తర్వాత స్టే ఇవ్వడం దారుణం. ఈ అంశంపైన రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలి. ప్రభుత్వ వైఖరిని బట్టి భవిష్యత్ ప్రణాళిక చేపడతాం. రాష్ట్ర బంద్ నిర్వహించి జనజీవనాన్ని స్తంభింపజేస్తాం. బీసీ రిజర్వేషన్ల చట్టానికి గవర్నర్ ఆమోదం తెలిపి ఉంటే హైకోర్టులో స్టే వచ్చేది కాదు. కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో బీసీ రిజర్వేషన్లు చేరిస్తే న్యాయపరమైన అవరోధాలు ఉండేవి కావు. బీసీ రిజర్వేషన్లపై రాజకీయ పార్టీలన్నీ డ్రామాలాడుతున్నాయి. శుక్రవారం హైదరాబాదులో బీసీ సంఘాలు, కుల సంఘాలు, మేధావులు అఖిలపక్ష పార్టీలతో సమావేశం నిర్వహించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం. రాజ్యాంగ సవరణ జరగకుండా బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు సాధ్యం కావని తెలిసినా రాష్ట్ర ప్రభుత్వం దానిపై దృష్టి పెట్టకుండా జీవో 9ని ఇచ్చి అన్యాయం చేసింది. 42 శాతం రిజర్వేషన్లు అమలు సాధ్యం కాదని తెలిసినా కామారెడ్డి బీసీ డిక్లరేషన్ విడుదల చేసి బీసీలను కాంగ్రెస్ మరోసారి మోసగించింది. బీసీల రిజర్వేషన్ల కోసం మరో మండల్ ఉద్యమానికి శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉందని, అందరం కలిసి నేటి బంద్‌ను విజయవంతం చేద్దామని కుల నిర్మూలన వేదిక అధ్యక్షుడు పాపని నాగరాజు వ్యాఖ్యానించారు. అగ్రకుల పాలకుల మీద ఆధారపడకుండా స్వతంత్ర బీసీ ఉద్యమ నిర్మాణం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రభుత్వం గురువారం రాత్రిలోగా నిర్ణయం ప్రకటించకుంటే బంద్ నిర్వహిస్తామని ఎమ్మెల్సీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న తెలిపారు.



# బీఆర్ఎస్, బీజేపీలే అడ్డుకున్నాయి



గురువారం గాంధీభవన్‌లో ఆయన టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తదితరులతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. 2018లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీరాజ్ సంస్థల్లో రిజర్వేషన్ 50 శాతం మించకుండా చట్టం చేసిందని, అదే ఉరితాడుగా తయారైందని అన్నారు. 2019లో ఎన్నికలు జరిపిన వెంటనే ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం బీసీలపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కులగణన చేసి జీవో ఇచ్చేదన్నారు. బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలంటే ఎంపిరికల్ డాటా అవసరమని హైకోర్టు చేసిన సూచనతోనే ప్రభుత్వం సైంటిఫిక్‌గా అధ్యయనం చేసి జీవో 9 తీసుకొచ్చిందన్నారు. బిల్లును అసెంబ్లీలో ఆమోదించి పంపితే బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్రం దానిని చట్టం కాకుండా నిలిపివేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ కూడబలుక్కొని బీసీల నోటికాడి ముద్దను దూరం చేశాయన్నారు.

### రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లాలనేది కాంగ్రెస్ ఆలోచన: మహేశ్‌గౌడ్

కాంగ్రెస్ పార్టీ కోర్టులను, చట్టాలను గౌరవిస్తుందని, బీసీలకు 42 శాతం రిజర్వే షన్లతో చట్టబద్ధంగా ఎన్నికలకు వెళ్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. కోర్టు తీర్పు వచ్చిన తరువాత పరిశీలించి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. బీసీ రిజర్వేషన్లపై బీజేపీ, బీఆర్ఎస్ కుటిలయత్నాలు చేస్తున్నాయని, అడుగడుగునా బీసీలను అణగదొక్కిన పార్టీ బీఆర్ఎస్ అని ఆరోపించారు.

### రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం : పొన్నం, జూపల్లి, వాకిటి శ్రీహరి

హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల కాపీ అందిన తరువాత ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రులు తెలిపారు. చట్టపరంగా, న్యాయపరంగా బీసీలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తుందని మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి చెప్పారు. ప్రభుత్వం కుల సర్వే నిర్వహించడంతో పాటు డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేసి.. మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి.. బీసీ బిల్లుకు అసెంబ్లీలో చట్టం చేసి గవర్నర్‌కు పంపించామని గుర్తు చేశారు. అసెంబ్లీ ఆమోదించిన బీసీ రిజర్వేషన్ల బిల్లును గవర్నర్ ఆమోదించకపోవడం బాధాకరమని జూపల్లి అన్నారు. బీసీలకు నోటికాడికి వచ్చిన ముద్ద లాగేసినట్లు చేశారు. బీసీ రిజర్వేషన్లకు ఎవరు అడ్డుపడుతున్నారో తెలంగాణలోని బీసీలంతా ఆలోచించాలని వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

# ఐదేళ్లలో 1.32 లక్షల ఎకరాలు

వచ్చేలా చూడాలని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. అలాగే 2.45 లక్షల ఎకరాల్లో కూరగాయల పంటల విస్తీర్ణం పెంచడం ద్వారా అధిక దిగుబడులు సాధించాలని నిర్ణయించింది. ఈ మేరకు విశ్వవిద్యాలయం రూపొందించిన 'తెలంగాణ రాష్ట్ర ఉద్యానవన అభివృద్ధి ప్రణాళిక%–%2035'ను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం తన నివాసంలో ఆవిష్కరించారు. వచ్చే పదేళ్లలో అనుసరించాల్సిన అభివృద్ధి ప్రణాళికను రూపొందించడంపట్ల విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ డి. రాజి రెడ్డి, డాక్టర్ ఎ. భగవాన్, డాక్టర్ జి.పి. సునందిని సీఎం అభినందించారు.

# భారత్‌తో యుద్ధం తప్పదు!

## పాక్ మంత్రి ఖవాజా ఆసిఫ్ ప్రేలాపనలు

ఇస్లామాబాద్: భారత్‌తో త్వరలో యుద్ధం జరిగే అవకాశాలు ఉన్నాయని పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ అన్నారు. ఈసారి యుద్ధం జరిగితే పాకిస్తాన్ గతంకంటే మంచి ఫలితాలు సాధిస్తుందని తెలిపారు. మంగళవారం సమా టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'భారత్‌తో యుద్ధం జరిగే అవకాశాలు నిజంగానే ఉన్నాయి. పరిస్థితిని ఉద్రిక్తం చేయటం నా ఉద్దేశం కాదు. కానీ ప్రమాదం ఉన్నమాట నిజం. నేను దానిని తోసిపుచ్చలేను. ఒకవేళ యుద్ధమే వస్తే.. దేవుడి దయవల్ల మనం గతంకంటే మంచి ఫలితాలు సాధిస్తాం. గత ఆరు నెలల క్రితంకంటే ఇప్పుడు పాకిస్తాన్‌కు ఎక్కువమంది మద్దతుదారులు, మిత్రులు ఉన్నారు. గత మే నెలలో చోటుచేసుకున్న ఘర్షణ సమయంతో పోల్చితే భారత్ ఇప్పుడు మద్దతుదారులను కోల్పోయింది'అని పేర్కొన్నారు. మధ్యయుగంలో మొఘల్ పాలకుడు ఔరంగజేబు పాలనలో తప్ప భారత్ ఎప్పుడూ ఒకేదేశంగా లేదని ఖవాజా చెప్పుకొచ్చారు. కానీ, అల్లా దయతో ఏర్పడిన పాకిస్తాన్ ఒకే ఐక్య రాజ్యంగా ఉంటూ అంతర్గతంగా ఎన్ని సమస్యలు ఉన్నా ఇటీవలి సైనిక ఘర్షణ సమయంలో ఐక్యంగా నిలబడిందని పేర్కొన్నారు. ప్రపంచ పటంలో పాకిస్తాన్ ఉండాలంటే ఉగ్రవాదానికి మద్దతిచ్చే చర్యలను మానుకోవాలని ఇటీవల భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరించిన విషయం తెలిసిందే.

# రిజర్వేషన్లపై కాంగ్రెస్ మోసాన్ని ఎండగట్టండి

పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో చర్చించారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసగించిన తీరును ప్రజల్లో ఎండగట్టాలని కేసీఆర్ ఆదేశించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని.. అసెంబ్లీ లోపలా, బయటా బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించినా జీవోకు చట్టబద్ధత సాధించడంలో రేవంత్ ప్రభుత్వం విఫలమైందని కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు తెలిసింది. బీసీ రిజర్వేషన్ల అంశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేలా త్వరలో ఉద్యమ కార్యాచరణ ప్రకటించే యోచనలో కేసీఆర్ ఉన్నట్లు సమాచారం. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సన్నద్ధతపైనా ఈ భేటీలో కేసీఆర్ సమీక్షించారు. ఐదుగురు మాజీ మంత్రుల నేతృత్వంలో ఏర్పాటైన వార్ రూమ్ పనిచేయాల్సిన తీరుపై ఆయన దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ అభ్యర్థిగా నవీన్ యాదవ్ ఎంపికైన నేపథ్యంలో ఆ పార్టీ అనుసరించే వ్యూహం, అభ్యర్థి బలాబలాలను విశ్లేషించి పలు సూచనలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు వాయిదా పడినందున గ్రామీణ ప్రాంత నేతలు, కేడర్‌ను కూడా జూబ్లీహిల్స్ ప్రచారంలో భాగస్వాములను చేయాలని కేసీఆర్ ఆదేశించారు. దీంతో ఉపఎన్నిక ప్రచార వ్యూహానికి తుదిరూపు ఇచ్చేందుకు కేటీఆర్, హరీశ్‌రావు ఒకట్రెండు రోజుల్లో పార్టీ డివిజన్ ఇన్‌చార్జిలు, ముఖ్య నేతలతో భేటీ కానున్నారని సమాచారం.

# ఆ దగ్గు సిరప్‌లను ఉపసంహరించాం

ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించింది. ఉపసంహరిం చుకున్న దగ్గు సిరప్‌లలో ఏ ఒక్కటి కూడా విదేశాలకు ఎగుమతి కాలేదని కూడా స్పష్టం చేసింది. భారత్‌లో దగ్గు సిరప్ వాడకంతో కిడ్నీలు ఫెయిలై, చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నట్లు వస్తున్న వార్తలపై ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ఆందోళన వ్యక్తం చేసింది. ప్రమాదకరమైన ఈ ఔషధాలను ఇతర దేశాలకు ఎగుమతి అయ్యాయా తెలపాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. సీడీఎస్‌సీవో స్పందించి డబ్ల్యూహెచ్‌వోకు ఇచ్చిన సమాధానంలో పై విషయాలున్నాయి. ఈ దగ్గు సిరప్‌లలో ఇథలీన్ గ్లైకాల్, లేదా డై ఇథలీన్ గ్లైకాల్ మరేదైనా కల్తీ జరిగినట్లు గుర్తించారా అనే విషయం తమకు తెలియజేయాలని కూడా డబ్ల్యూహెచ్‌వో కోరింది. ఇలాంటివి గుర్తిస్తే వాటి సరఫరా విక్రయాలను వెంటనే నిలిపివేయాలని కూడా కోరింది. మధ్యప్రదేశ్‌లో కల్తీ దగ్గు సిరప్ తాగి 20 మందికి పైగా చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన ఘటన నేపథ్యంలో డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా(డీసీజీఐ) రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల డ్రగ్ కంట్రోలర్లను అప్రమత్తం చేసింది. ఔషధ తయారీ యూనిట్లను తనిఖీ చేసి, సరైన ముడిపదార్థాలను వాడుతున్నారా లేదా గమనించాకే వాటిని మార్కెట్‌లోకి విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.

# 11న అంగరంగ వైభవంగా రాయదుర్గంలో మల్కంచెరువు కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ట






శేరిలింగంపల్లి వార్త మిర్రర్ :శేరిలింగంపల్లి నియోజకవర్గం, గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంలోని మల్కం చెరువు కట్ట మైసమ్మ విగ్రహ ప్రతిష్ట 09వ తేదీ గురువారం నుండి11వ తేదీ శనివారం రోజు వరకు అంగరంగ వైభవంగా పూజలు జరుగుతాయి. అమ్మవారి విగ్రహ ప్రతిష్ట వేద శాస్త్ర పండితులచే అంగరంగ వైభవం గా నిర్వహిస్తారని గ్రామస్తులు తెలిపారు. కావున గ్రామస్తులు, పెద్దలు, చిన్నలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించి అమ్మవారి కృపా కటాక్షాలకు పాత్రులై ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వుండేలా అమ్మవారి ఆశీస్సులు పొందే అదృష్టం నోచుకోగలరని రాయదుర్గం బస్తీ ప్రజలు కోరుతున్నారు. అలాగే అమ్మ వారి ఆలయ నిర్మాణం కోసం కృషి చేసిన ఆర్డీవో, కలెక్టర్, ఎం ఆర్. ఓ పోలీసు ఉన్నత అధికారులు, సిబ్బంది కి ఈ సందర్భంగా రాయదుర్గం ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

రాయదుర్గం నందు నూతనంగా నిర్మితమైన దేవాలయంలో, 10-10-2025 శుక్రవారం ఉదయం 6 గం.ల సాయంత్రం పూజా శయ్యాది వాసం, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ జరుగును. స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సర, దక్షిణాయము, శిరదృతువు ఆశ్వయుజ బహుళ పంచమి శనివారం రోహిణి నక్షత్రయుక్త వృచ్చిక లగ్నమందు 11-10-2025 ఉ. 9.05 ని.లకు శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ట జరుపబడును ఈ దైవ కార్యక్రమం నందు భక్తులందరూ అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కాగలరు అని రాయదుర్గం వాస్తవ్యులు తెలిపారు.శనివారంఉదయం 6 గంటలకు గణపతి పూజ,మండప పూజ, హెూమంశ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపనం అభిషేకం,హారతి,అర్చన,నివేదన,మంత్రపుష్పం పూర్ణాహుతి హెూమం,తీర్థప్రసాద వితరన 4 గంటలకు బోనాల కార్యక్రమం జరుగుతుంది.గణపతి పూజ, మండప పూజ, హెూమం, ద్విధివాసం, హెూమం, పుష్పాదివాసం హెూమం ఫలాదివాసం హెూమం, హారతి తీర్థప్రసాద వితరణ లో భక్త మహాశయులు పాల్గొనీ విజయవంతం చేయవలసింది గా రాయదుర్గం వాస్తవ్యులు ఈ సందర్భంగా తెలిపారు

# అబద్దాల హామీలకు బ్రాండ్ అంబాసిడర్ సీఎం రేవంత్ రెడ్డి

**పిలాయిపల్లి గ్రామంలో ఇంటింటికి కాంగ్రెస్ బాకీ కార్డుల ప్రచారంలో**

**మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి**





యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి భువనగిరి నియోజకవర్గం భూదాన్ పోచంపల్లి మండలం పిల్లాయిపల్లి గ్రామంలో ఇంటింటికీ కాంగ్రెస్ బాకీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షులు కంచర్ల రామకృష్ణ రెడ్డి తో కలిసి పాల్గొన్న భువనగిరి మాజీ శాసనసభ్యులు బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పైళ్ల శేఖర్ రెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అబద్ధాల హామీల కు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్ రెడ్డి అని బాకీ కార్డులతో కాంగ్రెస్ బండారం బయటపెట్టి స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ మోసాలకు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు..ఈ కార్యక్రమంలో జిల్లా,మండల బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌లో చేరికలు

**- కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్**



కల్వకుర్తి అక్టోబర్ 9 వార్త మిర్రర్ ప్రతినిధి:- తెలంగాణలో అధికారం చేజిక్కించుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ, అబద్ధపు ప్రచారాలు, అమలుకాని హామీలతో ప్రజలను మోసం చేస్తుందని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ ఆరోపించారు. గురువారం కడ్తాల్ మండల కేంద్రంలో గడ్డమీద తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ మాజీ వార్డు సభ్యులు, సీనియర్ నాయకుడు విస్లావత్ అమృ నాయక్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దశరథ్ నాయక్ తన నివాసంలో బీఆర్ఎస్ కండువా కప్పి ఆయనకు పార్టీలో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా దశరథ్ నాయక్ మాట్లాడుతూ,కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రజలను మభ్యపెట్టే హామీలు ఇస్తోంది. ఇది 'డైవర్షన్ పాలిటిక్స్'. ప్రజలు ఈ కుటిల నాటకాలకు లోనయ్యే పరిస్థితి లేదు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతారు.అలాగే, బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆ పథకాలను తుంగలో తొక్కేసింది. కేసీఆర్ తెలంగాణకు అందించిన అభివృద్ధి ఫలితంగా అనేకమంది బీఆర్ఎస్‌లో చేరడం చూస్తుంటే, రానున్న ఎన్నికల్లో పార్టీ విజయం ఖాయమవుతోంది." అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్‌డైరెక్టర్ సేవ్య నాయక్‌మాజీ సర్పంచులు తులసి రామ్ నాయక్, హరిచంద్, శ్వేతాబునాథ్ మాజీ ఎంపీపీ సువాలి పంతు నాయక్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ ,రమేష్ నాయక్, ఎల్లా గౌడ్, శ్రీను, మహేష్, మల్లేష్, కిషన్, పాండు, అంజద్, సరియా, రవి, దశరథ్, జైపాల్, జగన్, మదన్, నరేష్, మల్లేష్ పాల్గొన్నారు.

# సీజేఐపై జరిగిన దాడి దేశ చరిత్రలో చీకటి రోజుగా మిగిలిపోతుంది






మిర్యాలగూడ, అక్టోబర్ 9:-( వార్త మిర్రర్) సీజేఐపై దాడి భారత సర్వోన్నత న్యాయస్థానం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పైన జరిగిన దాడిగా పరిగణించాలని జన విజ్ఞాన వేదిక జాతీయ కన్వీనర్ డాక్టర్ మువ్వా రామారావు అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక మిర్యాలగూడలోని జ్యోతిబాపూలే బిసి భవన్లో కస్తూరి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో రామారావు మాట్లాడుతూ దేశ చరిత్రలో అక్టోబర్ 6న జరిగిన దాడి చీకటి రోజుగా మిగిలిపోతుందని, భారత ప్రధాన న్యాయమూర్తిపై కోర్టులో దాడి జరిగితే సామాన్య మానవుని పరిస్థితి ఏమిటో ప్రతి ఒక్కరు అర్థం చేసుకోవాలని అన్నారు. విద్యావికాస వేదిక కన్వీనర్ కస్తూరి ప్రభాకర్ మాట్లాడుతూ అత్యున్నత న్యాయస్థానంలో సీజేఐపై దాడి సరైంది కాదని అన్నారు. విద్యావంతుల వేదిక తెలంగాణ అధ్యక్షులు అంబటి నాగయ్య మాట్లాడుతూ వందేళ్ళ సనాతన ధర్మం పేరుతో సీజేఐపై దాడి భారత ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేసినట్లు అయిందని అన్నారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు బీసం రామయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో భారత్ బచావో జిల్లా అధ్యక్షులు ఉదయ, కెవిపిఎస్ నాయకులు పరశురాములు, జెవివి జిల్లా అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, డాక్టర్ జె.రాజు, కందుకూరి సుదర్శన్, రవినాయక్, హరికృష్ణ, డిఎస్పీ నాయకులు తరి యల్లయ్య, ఎంసీపిఐయు నాయకులు పి.కాశి, కిరణ్మయి, దశరథనాయక్, రాజారత్నం, కోల సైదులు, స్వామి, మోహన్ రావ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఘనంగా పెద్దమునిగల్‌లో పోషణ మాస ఉత్సవాలు



నేరేడుగొమ్ము అక్టోబర్ 09 వార్త మిర్రర్ :నేరేడుగొమ్ము మండలం పెద్దమునిగల్ సెక్టార్ పరిధిలోని అంగన్వాడి కేంద్రాలలో పోషణ మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐసిడిఎస్ సూపర్వైజర్ శోభ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషణ గురించి వివరించడం జరిగింది. రోజు తీసుకునే ఆహారంలో విటమిన్లు క్యాల్షియం ఖనిజ లవణాలు ఉండేలా చూసుకోవాలని గర్భిణీ స్త్రీలు బాలింతలు ప్రతిరోజు అంగన్వాడి కేంద్రంలో ఆహారం తీసుకోవడం వలన పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారు అని ఆమె తెలిపారు. అనంతరం వెల్ బేబీ షో పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలో గెలుపొందిన వారికి బహుమతి అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు అరుణ భాగ్యమ్మ సువార్త సరిత లక్ష్మి గర్భిణీ స్త్రీలు బాలింతలు వారు పాల్గొన్నారు.



## సిఎన్ ఆర్ కన్వేషన్ హాల్ ప్రారబించిన మాజీ మేయర్ దంపతులు

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 09 : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ బడంగ్ పేట్ లోని రోమా కాలనిలో నూతనంగా నిర్మించిన సిఎన్ ఆర్ కన్వేషన్ హాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి దంపతులు ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి , మాజీ కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, రాళ్లగూడెం సంతోష శ్రీనివాస్ రెడ్డి, నాయకులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, బొల్లపల్లి కుమార్, సూర్ణగంటి విజయ్, చప్పిడి కృష్ణారెడ్డి, చప్పిడి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బస్ ఛార్జీల పెంపు కి నిరసన తెలిపే బి ఆర్ ఎస్ పార్టీ నాయకుల ముందస్తు అరెస్టులు..

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : కాంగ్రెస్ గవర్నమెంట్ బస్ చార్జీలను పెంచి సామాన్య ప్రజలపై భారం మోపి, మహిళలకు ఫ్రీ బస్ పెట్టినట్టు పెట్టి ఆ ఆదాయాన్ని బస్ లో ప్రయాణం చేస్తున్న మగవాడి మీద భారం వేస్తూ చార్జీలను పెంచిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చర్యల ను ఎండగడుతూ గురువారం రోజు బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె టి ఆర్ పిలుపు మేరకు బస్ భవన్ ముట్టడి సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఆ నిరసన తెలిపే కార్యక్రమం కు వెళ్లకుండా ముంధస్తుగా తెల్లవారుజామున 5 గంటలకే ఇంటికి వచ్చి పోలీస్ లు హౌస్ అరెస్ట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మియాపూర్ డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ ప్రెసిడెంట్, సీనియర్ నాయకులు వాలా హరీష్ రావు, జనార్ధన్ గౌడ్, బాబూ మోహన్ మల్లేష్ తదితరులను మియాపూర్ స్టేషన్ కు తరలించి రిమాండ్ లో కీ తీసుకుని సాయంత్రం వదలి పెట్టారు.

## రాష్ట్ర కబడ్డీ జట్టుకు ఎంపికైన బిసి గురుకుల కాలేజీ విద్యార్థులు



మిర్యాలగూడ అక్టోబర్ 9:-( వార్త మిర్రర్)మిర్యాలగూడ నియోజకవర్గం దామరచర్ల బీసీ గురుకుల కాలేజీలో చదువుతున్న జి.స్పందన, సిహెచ్.గాయత్రీలు కబడ్డీ ఎస్జిఎఫ్ రాష్ట్ర జుట్టుకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉమాదేవి, పిడి ఇందిర, ఏటిపి నాగలక్ష్మి, పిఇటి.సుజాత, అధ్యాపక బృందం రాష్ట్ర కబడ్డీ జట్టు ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఈనెల 10 నుండి 13 వరకు మహబూబాబాద్ లో జరగబోయే 69వ రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా జట్టు తరపున రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొనున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేసి యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు.



## బిఆర్ఎస్, కాంగ్రెస్ ల నుండి భారీగా బిజెపిలో చేరికలులి

**ప్రజలు కాంగ్రెస్ ' బిఆర్ఎస్ పార్టీలను నమ్మరు - శ్రీరాములు అందెల**

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 09 : మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల్ గొల్లూరు గ్రామంలో గురువారం మండల బిజెపి అధ్యక్షులు యాదీష్ ఆధ్వర్యంలో పలువురు బిఆర్ఎస్ మరియు కాంగ్రెస్ పార్టీల నాయకులు రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ మరియు రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ అందెల శ్రీరాములు సమక్షంలో భారతీయ జనతా పార్టీ లో చేరడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్ మరియు బిఆర్ఎస్ పార్టీలను నమ్మే పరిస్థితుల్లో లేరని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇరు పార్టీలకు ప్రజలు తగిన బుద్ధి చెప్తారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. భారతీయ జనతా పార్టీ నాయకులందరూ కలిసికట్టుగా స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కో కన్వీనర్ అనంతయ్య గౌడ్, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ కుండే వెంకటేష్, మాజీ మండల్ అధ్యక్షులు మాధవచారి, బిజెపి సీనియర్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, ప్రభాకర్ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు రఘుపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

మిర్యాలగూడ , అక్టోబర్ 9:-( వార్త మిర్రర్) ఈ నెల 14, 15న జరిగే తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఐదవ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతంరెడ్డి, పట్టణ కన్వీనర్ తిరుపతి రామ్మూర్తి కోరారు. గురువారం స్థానిక సిఐటీయూ కార్యాలయంలో మహాసభల పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాసభలు రంగారెడ్డి జిల్లా తుర్కయంజల్లో జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సిహెచ్ వెంకన్న, మోహన్, వీరయ్య, లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్ బావాండ్ల పాండు, రైస్ మిల్ డ్రైవర్ నాయకుడు పాపిరెడ్డి , భాష, శాబునగర్ సిపిఎం కార్యదర్శి బంటు రామారావు పాల్గొన్నారు.

## పెంచిన బస్సు చార్జీలు వెంటనే తగ్గించాలి..

### బిఆర్ఎస్ పార్టీ నాయకులు బోయిని నరసింహ యాదవ్



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి అక్టోబర్ 09

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన బస్సు చార్జీలను తగ్గించాలని బస్సు చార్జీల పెంపుకు నిరసనగా బిఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమాన్ని అడ్డుకోవడంలో భాగంగా చేసిన అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం అని బిఆర్ఎస్ పార్టీ చౌటుప్పల్ మండల నాయకులు బోయిని నరసింహ యాదవ్ ఒక పత్రిక ప్రకటనలో తెలియజేసారు.ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన అంటూ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ పాలన కొనసాగిస్తుందని కనీసం నిరసన చెప్పే హక్కు కూడా కల్పించడం లేదని ఎక్కడికక్కడ ఇండ్ల దగ్గరే పార్టీ శ్రేణులను నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అప్పటికే నష్టాల్లో ఆర్టీసీ ఉందని సంస్థ చెబుతున్నప్పుడు కూడా దాన్ని పట్టించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం పెట్టి ఇంకా నష్టాల్లోకి నెట్టిందని ఆ భారాన్ని ప్రజల మీద మోపేందుకు ఈరోజు చార్జీలు పెంచడం అన్యాయమని అనేక రూట్లలో బస్సులు రద్దు చేయడమే కాకుండా సంఖ్యను తగ్గించారని ప్రైవేటు వాహనాలను పెంచి ప్రైవేట్ ను ప్రోత్సహించే విధంగా ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్ర ఈ రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని అందులో భాగంగానే చార్జీలు పెంచిందని రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కున్నటువంటి ఆస్తుల్ని ఇష్టం వచ్చినట్లుగా ప్రైవేటు వ్యక్తులకు అప్పచెప్పుతుందని అన్నారు పెంచిన బస్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు...

## స్థానిక సంస్థ ఎన్నికల్లో ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తివేయాలి

### బహుజన రాజ్యం పార్టీ పులే అంబేద్కర్

### జాతీయ అధ్యక్షుడు లాలు నాయక్ రమావత్



దేవరకొండ అక్టోబర్ 09 వార్త మిర్రర్::తెలంగాణ వ్యాప్తంగా స్థానిక సంస్థ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మునిసిపల్ లాగానే స్థానిక సంస్థ ఎన్నికల్లో ముగ్గురు పిల్లల నిబంధనను ఎత్తివేయాలని ఎత్తివేసి జీవో విడుదల చేయాలని బహుజన రాజ్యం పార్టీ పులే అంబేద్కర్ జాతీయ అధ్యక్షుడు లాలూ నాయక్ రమావత్ తెలిపారు. తమ పార్టీ ద్వారా 2014లో రిజర్వేషన్లపై ఇందిరాపార్క్ వద్ద నిరాహార దీక్షలు చేపట్టినట్టు తెలిపారు. బీసీ రిజర్వేషన్స్ కోసం తమ పార్టీ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. చట్టసభలలో ఎస్సీ ఎస్టీలకు సామాజిక న్యాయం ఏ విధంగా అయితే అమలు చేస్తున్నారో అలాగే చట్టసభలలో బీసీ సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ తదితర స్థానిక సంస్థల్లో పోటీ చేసే వారికి పిల్లల నిబంధన ఎత్తి వేసి నోటిఫికేషన్ జారీ చేయాలి బహుజన రాజ్యం పార్టీ పూలే అంబేద్కర్లాలూ నాయక్ రమావత్జాతీయ అధ్యక్షుడు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## భారత్-బ్రిటన్ మధ్య కీలక ఒప్పందం.. దేశంలో అడుగుపెట్టబోతున్న 9 విశ్వవిద్యాలయాలు.

బ్రిటిష్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ భారతదేశంలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం (అక్టోబర్ 9), ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముంబైలోని రాజ్ భవన్లో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రధాన మంత్రి మోదీ-కీర్ స్టార్మర్ మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా విద్యా రంగంలో ప్రధాన కార్యక్రమాలను ప్రకటించారు.బ్రిటిష్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ భారతదేశంలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం (అక్టోబర్ 9), ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముంబైలోని రాజ్ భవన్లో ఆయనకు ఘన స్వాగతం పలికారు.




## ఎంబిబిఎస్ సీటు సాగించిన విద్యార్థిని అభినందించిన ఉపాధ్యాయులు

మిర్యాలగూడ, అక్టోబర్ 9:-( వార్త మిర్రర్)మిర్యాలగూడ లోటస్ హైస్కూల్లో పదవ తరగతి మొదటి బ్యాచ్ కు చెందిన వెంపటి సాయిసహస్ర అనే విద్యార్థిని అద్భుత ప్రతిభ కనబరిచి ఇంటర్ తర్వాత నేరుగా జాతీయస్థాయిలో జరిగిన నీట్ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 1711 వ ర్యాంక్ సాధించి ఎంబిబిఎస్. మెడిసిన్ సీటును పొందారు. ఈ సందర్భంగా లోటస్ విద్యాసంస్థల చైర్మన్ బి. వరప్రసాద్సాయిసహస్రకు బోకే అందజేసి శాలువతో అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ వెంకన్న, అధ్యాపకులు శ్రీనివాస్ రెడ్డి, పవన్ కుమార్, నాగుల్ మీరా, వెంకన్న, అజీముద్దీన్, సురేష్, శ్రీనివాస్, జావెద్, లతీఫ్, సతీష్, సరిత, కావ్య, పిఈటి సతీష్, విద్యార్థినిని అభినందించి, స్వీట్లు తినిపించారు.

# బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడం బాధాకరం

### బీసీ సంఘాల నేతలు



మిర్యాలగూడ , అక్టోబర్ 9:-( వార్త మిర్రర్) స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ లు పెంచుతూ జారీ చేసిన జిఓపై హైకోర్టు స్టే విధించడం చాలా బాధాకరమైన విషయమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. హైకోర్టు వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ బీసీలు కోరినవి గొంతెమ్మ కోరికలు కావని అసెంబ్లీలో అన్ని రాజకీయ పార్టీలు కూడా మద్దతు ఇచ్చి తీర్మానం చేసి జీవో తీసుకొచ్చారని ఏదో కుంటి సాకులు చెప్పి స్టే ఇవ్వడం చాలా బాధనిపించింది అని అన్నారు.10 శాతం లేని అగ్రవర్ణాలు 10 శాతం పైన రిజర్వేషన్ అనుభవిస్తున్నప్పుడు 60 శాతం పైగా ఉన్న బీసీలు 42 శాతం రిజర్వేషన్లు అనుభవిస్తే వారికి వచ్చే నొప్పి ఏమిటో అర్థం కావడం లేదన్నారు.హైకోర్టు స్టే తీవ్ర నిరాశ కలిగించిందిటిడిపి నేత సత్యంరాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం సాహసోపేతమైన నిర్ణయం. ఇది జీ ర్ణించుకోలేని అగ్రవర్ణాలు హైకోర్టును ఆశ్రయించి బీసీలకు తీరని అన్యాయం చేశారని తెలుగుదేశం పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి శ్రీ కాసుల సత్యం ఆవేదన వ్యక్తం చేద్దాంశారు. 42 శాతం రిజర్వేషన్లు సాధించేవరకు పోరాట శంఖారావం పూరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ముక్కెర అంజిబాబు యాదవ్, ఈ. సైదానాయక్, జానీ మియా, సయ్యద్, ఎండి రసూల్, సైదులు, కనకయ్య అన్నారు.బీసీల నోటి దగ్గరి ముద్ద గుంజు కోవడం సబబు కాదు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి



నల్లగొండ జిల్లా అధ్యక్షులు పోగుల సైదులు గౌడ్ అగ్రకుల నాయకులు న్యాయస్థాన్ అడ్డుపెట్టుకొని బీసీల నోటి కాడ ముద్దని లాక్కుంటున్నారని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పోగుల సైదులు గౌడ్ అన్నారు. అన్ని బీసీ సంఘాలు కుల సంఘాలు కలిసి పార్టీలకతీతంగా పోరాడితే తప్ప, బీసీ సమాజం మొత్తం మరొకసారి రోడ్లమీదకి వచ్చి పోరాడే సమయం ఆసన్నమైందన్నారు బీసీలపై చిన్న చూపు చూస్తుబీసీలను అణగదొక్కాలని చూస్తున్న అగ్రకుల నాయకత్వంపై తిరుగుబాటు చేయాలన్నారు

## రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన లిటిల్ ఫ్లవర్ స్కూల్ విద్యార్థి

మిర్యాలగూడ, అక్టోబర్ 9:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ ఎన్ఎస్పి క్యాంపు ఇండోర్ స్టేడియంలో ఈనెల 6న బాక్సింగ్ కోచ్ రవీందర్ ఆధ్వర్యంలో నేషనల్ స్కూల్ గేమ్స్ పర్యవేక్షణలో జరిగిన అండర్ %-%17 బాక్సింగ్ జిల్లా స్థాయి సెలక్షన్ పోటీలలో మిర్యాలగూడ పట్టణం హౌసింగ్ బోర్డు లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ లో 10వ తరగతి విద్యార్థి పల్లపు నవదీప్ రాష్ట్ర స్థాయి పోటీలకు నల్గొండ జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. ఈ నెల 10న హన్మకొండలోని ఇండోర్ స్టేడియం లో రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయి. ఈ సందర్భంగా స్కూల్ ఆవరణలో బాక్సింగ్ జట్టుకు ఎంపికైన విద్యార్థి నవదీప్ అభినందించారు ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ కేకే.జయరాజన్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరాలని, మరెన్నో విజయాలను సాధించాలన్నారు. స్కూలులో విద్యతో క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తూ, పిఈటిల ఆధ్వర్యంలో తగిన శిక్షణ ఇప్పిస్తూ పిల్లలను ఏ స్థాయి పోటీలకైన పిల్లలను పంపడంలో లిటిల్ ఫ్లవర్ ఎప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జిన్సీ జయరాజన్, హెచ్ఎం.సుజయ్ కుమార్, పిఈటీలు నీలం రమేష్, ఎం.శివశంకర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.




# మిర్యాలగూడలో బగ్గుమన్న బీసీ సంఘం

### బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం





మిర్యాలగూడ, సెప్టెంబర్ 9:-( వార్త మిర్రర్) బీసీలకు స్థానిక ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో స్టే విధించడాన్ని నిరసిస్తూ మిర్యాలగూడలో బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా తిరుమలగిరి అశోక్ మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు జరుగుతాయని ఆశాభావంతో ఉన్న తరుణంలో కోర్టు బీసీలను చావు దెబ్బ కొట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదులు బలమైన వాదన వినిపించకపోవడం వలనే కోర్టు స్టే విధించిందని భావిస్తున్నామన్నారు. బీసీలను బిచ్చగాళ్ళుగా చూస్తున్న రాజకీయ పార్టీల నాయకులు కొంతమంది జడ్జిలు, న్యాయవాదులు, అగ్రవర్ణ నాయకులకు త్వరలోనే తగిన బుద్ధి చెప్తామని ఆయన హెచ్చరించారు. బీసీలపై చిత్తశుద్ధి లేకుండా పాత రిజర్వేషన్ ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తే మాత్రం రాష్ట్రం అగ్నిగుండంగా మారుస్తామని ఆయన హెచ్చరించారు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు జరిగిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు కార్యక్రమంలో జక్కా నాగేశ్వరరావు, రాంబాబు,, సైదులు, గంగాధర్, రామకృష్ణ గౌడ్, ఉపేందర్, నవీన్ పాల్గొన్నారు

# కస్తూర్భా గాంధీ బాలికల విద్యాలయం లో పోషణమాసం

మిర్యాలగూడ అక్టోబర్ 9:-( వార్త మిర్రర్) పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడిఎస్ దామరచర్ల ప్రాజెక్టు ఆఫీసర్ ఎన్. చంద్రకళ అన్నారు. ప్రాజెక్టు పరిధిలోని మాడుగులపల్లి మండలం కుక్కడం గ్రామ కస్తూర్భా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) లో గురువారం పోషణమాసం ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రకళ మాట్లాడుతూ కిషోర బాలికలకు పోషకాహార ప్రాముఖ్యత గురించి అవగాహన కలిగించారు. విటమిన్, పోషకాలు, వ్యక్తిగత పరిశుభ్రత గురించి మాట్లాడారు కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపెర్వైజర్స్ నాగమణి, లక్ష్మి, కేజీబీవీ ప్రిన్సిపాల్ వసంత, కెజిబివి టీచర్స్ , ఎంఎల్హెచ్పి జ్యోతి, ఎఎన్ఎం ఝాన్సీ, అంగన్వాడీ టీచర్స్ ఊర్మిళ, జానకి, తిరుపతమ్మ, రజిత, సుశీల, మరియమ్మ ఆశావర్కర్లు ,కిషోరబాలికలు పాల్గొన్నారు



## ఈ విషయం తెలుసా.. ప్రపంచంలోని ప్రతి ఒక్కరి నెత్తిపై అప్పు! అమెరికా, చైనా కూడా మినహాయింపు కాదు..

ప్రపంచవ్యాప్తంగా దేశాలు ఒకదానికొకటి, సామాన్య ప్రజల నుండి ట్రిలియన్ల డాలర్ల అప్పులు తీసుకుంటున్నాయి. మొత్తం ప్రపంచ అప్పు 300 ట్రిలియన్ డాలర్లకు చేరి, ఆర్థిక వ్యవస్థకు ముప్పుగా మారింది. ఈ రుణ భారం ద్రవ్యోల్బణాన్ని పెంచి, ఆర్థిక వృద్ధిని నెమ్మదిస్తుంది. అనిశ్చిత ఆర్థిక పరిస్థితులలో బంగారం, వెండి వంటి విలువైన లోహాల ప్రాముఖ్యత పెరుగుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.చైనా ఆఫ్రికన్ దేశాలు, పాకిస్తాన్, శ్రీలంక, మాల్దీవులు, అనేక ఇతర దేశాలకు డబ్బు అప్పుగా ఇస్తుంది. అయితే, చైనా స్వయంగా 18 ట్రిలియన్ డాలర్ల అప్పును కలిగి ఉంది. జపాన్ అమెరికాకు చాలా డబ్బు ఇచ్చింది. ఆ దేశం కూడా అప్పుల్లో మునిగిపోతోంది. అమెరికా ప్రపంచంలోని అనేక దేశాలకు ఆర్థిక సహాయం కూడా అందిస్తుంది. అయితే ప్రపంచంలోనే అత్యంత అప్పుల పాలైన దేశం అనే అపఖ్యాతిని కలిగి ఉంది. ఇలానే చాలా దేశాలు భారీగా అప్పుల పాలయ్యాయి.( పపంచవ్యాప్తంగా 300 ట్రిలియన్ డాలర్ల అప్పులుఅన్ని దేశాలు ఒకదానికొకటి అప్పులు ఇస్తున్నాయి, అప్పుల చక్రాన్ని సృష్టిస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పతనం అంచున ఊగిసలాడుతోందని పెట్టుబడి బ్యాంకర్ సార్థక్ అహుజా అన్నారు. లింక్డ్ఇన్ పోస్ట్లో సార్థక్ అహుజా అప్పు తగ్గడం లేదని, బదులుగా పెరుగుతోందని అన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ విలువ 100 ట్రిలియన్ డాలర్లు మాత్రమే. కానీ 300 ట్రిలియన్ డాలర్లు అప్పులో మునిగిపోతున్నాయి. మొత్తం ప్రపంచం అమెరికా ఆర్థిక వ్యవస్థ కంటే పది రెట్లు పెద్ద అప్పును కలిగి ఉంది.సామాన్య ప్రజలే రుణదాతలు..వివిధ దేశాలు తమ ఆర్థిక వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవడానికి డబ్బు అవసరం. ప్రభుత్వాలు వివిధ రకాల బాండ్లు లేదా డిబెంచర్ల ద్వారా సాధారణ ప్రజల నుండి, ప్రైవేట్ సంస్థల నుండి డబ్బు తీసుకుంటాయి. యునైటెడ్ స్టేట్స్ 36 ట్రిలియన్ డాలర్ల అప్పును కలిగి ఉంది. ఇందులో 70 శాతం సాధారణ ప్రజలకు బాకీ ఉంది. అమెరికా మాత్రమే కాదు, చాలా దేశాలకు ఇలాంటి అప్పుల కథలు ఉన్నాయి. వారి ప్రభుత్వ




అప్పు చాలా ఎక్కువగా ఉంది. అదనంగా, ప్రభుత్వాలు ఎక్కువ డబ్బు కోసం అవసరమైన దానికంటే ఎక్కువ డబ్బును ముద్రిస్తాయి. ఇది ద్రవ్యోల్బణాన్ని పెంచుతుంది. పెరుగుతున్న ధరల వేడి ఆర్థిక వ్యవస్థను నెమ్మదిస్తుంది.

# ఓ ఆటగాడి కథ

విజయ రామరాజు టైటిల్ రోల్‌లో రూపొందిన స్పోర్ట్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకత్వంలో శ్రీని గుబ్బల నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా యాంథమ్‌ని విడుదల చేశారు. చిత్ర సంగీతదర్శకుడు విఘ్నేష్ భాస్కరన్ స్వరపరచిన ఈపాటకు విక్రాంత్ రుద్ర సాహిత్యం అందించారు. దీపక్ బ్లూ, బృథ్వీవ్ సత్యకుమార్, విఘ్నేష్‌పాయ్ ఆలపించారు. విజయ రామరాజు ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌కి సంబంధించిన విజువల్స్ ఈపాటలో కనిపిస్తాయి. ఓ కబడ్డీ ప్లేయర్ నిజ జీవిత కథతో ఈ చిత్రాన్ని రూపొందించారు. "ఎమోషనల్ కథాంశంతో రూపొందించిన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తుందనే నమ్మకం ఉంది" అని దర్శక-నిర్మాతలు పేర్కొన్నారు.







# ఆ హీరోయిన్‌ని దారుణంగా విమర్శించిన మృణాల్.. కౌంటర్ ఇచ్చిన బిపాసా

తెలుగు ప్రేక్షకుల మదిలో సీతా మహాలక్ష్మిగా నిలిచిన మృణాల్ ఠాకూర్, ఇటీవల సినిమాల కంటే ఎక్కువగా వ్యక్తిగత విషయాలతో హాట్ టాపిక్ అవుతున్నారు.అక్కినేని సుమంత్‌తో పెళ్లి అంటూ వచ్చిన గాసిప్స్‌కి, ధనుష్‌తో డేటింగ్ అంటూ బాలీవుడ్‌లో చక్కర్లు కొట్టిన వార్తలకు క్లారిటీ వచ్చినట్లు కనిపించినా%ొ% తాజాగా ఆమె పాత వీడియో ఒకటి వెలుగులోకి వచ్చి మళ్లీ చర్చనీయాంశంగా మారింది. "బిపాసా కంటే నేనే అందంగా ఉంటాను" అంటూ చేసిన కామెంట్స్ వైరల్ అయ్యాయి. మృణాల్ టీవీ సీరియల్స్‌లో నటిస్తూ కెరీర్ ప్రారంభించిన కాలంలో ఆమె ఓ ఇంటర్వ్యూలో బిపాసా బసుపై కాస్త ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఎవరైనా కండలు తిరిగిన అమ్మాయిని పెళ్లి చేసుకోవాలనుకుంటే%ొ% బిపాసాను చేసుకోండి! నేను బిపాసా కంటే బెటర్‌గా ఉంటాను. ఆడవాళ్లు తనలా నాజుగ్గా ఉండాలని.. బిపాషా మాదిరి కండలు తిరిగిన వారిలా ఉండకూడదని.. ఆమెను చూస్తే మగవారిలా అనిపిస్తుందని మృణాల్ కామెంట్ చేసింది. ఇప్పుడు ఈ కామెంట్స్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఇది చాలా పాతదే అయినా ఇప్పుడు తెరపైకి వచ్చింది.ఈ వీడియో వైరల్ అవుతున్న నేపథ్యంలో బిపాసా బసు తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఓ మోటివేషనల్ కోట్ షేర్ చేశారు. బలమైన స్త్రీలు ఒకరికొకరు మద్దతుగా నిలబడాలి.మహిళలు బలంగా కనిపించడం తప్పు కాదు.శారీరక, మానసిక బలం కోసం కండలు అవసరం. పాతకాలపు ఆలోచనలు మార్చండి అనే కొటేషన్ పెట్టింది. నెటిజన్ల అభిప్రాయం ప్రకారం, ఇది మృణాల్ వ్యాఖ్యలకు కౌంటర్ లా ఉందని భావిస్తున్నారు.బిపాసా, ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రోనాల్డోతో కలిసి ఉన్న వీడియోను కూడా అదే సమయంలో షేర్ చేయడం గమనార్హం. ఇది చూసిన కొంతమంది అభిమానులు.. "తన స్థాయిని చూపించేందుకే ఈ వీడియో పెట్టిందా?" అంటూ కామెంట్స్ చేస్తున్నారు. అయితే సోషల్ మీడియాలో ఈ విషయంపై ట్రోల్ నడుస్తున్న క్రమంలో మృణాల్ స్పందించింది. 19 ఏళ్ల వయస్సులో సిల్లీ విషయాల గురించి మాట్లాడాను. అప్పుడు అవి ఎంత బాధిస్తాయో తెలియదు. మెచ్యూరిటీ లేదు.మనస్ఫూర్తిగా క్షమాపణలు చెబుతున్నా. ఒకరిని బాధించడం, ఒకరిని ఇబ్బంది పెట్టాలనేది నా ఇంటెన్షన్ కాదు. ఫ్రెండ్స్‌తో చిట్ చాట్ విషయంలో కాస్త హద్దులు దాటి ఇలా జరిగింది. క్షమించండి అని మృణాల్ పేర్కొంది.

# మిడిల్ క్లాస్ కుర్రాడు



అమర్‌దీప్, సైలీ జంటగా నటించిన చిత్రం 'సుమతీ శతకం'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో ఎమ్ఎమ్ నాయుడు దర్శకత్వంలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. ఈ సినిమా నుంచి అమర్ దీప్ ఫస్ట్‌లుక్‌పోస్టర్ విడుదల చేశారు. "ఈ చిత్రంలో ఓ మిడిల్ క్లాస్ కుర్రాడిలా అమర్‌దీప్ కనిపిస్తారు. దసరాకి ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలనే లక్ష్యంతో ఉన్నాం" అని చిత్రబృందం పేర్కొంది.


# అడవుల్లో సాహసం



సాహసం చేయడానికి సై అంటూ కథానాయిక సంయుక్త అడవి బాట పట్టారు. దట్టమైన అడవుల్లో ఆమె ట్రెక్కింగ్‌కి వెళ్లారు. అందులోనూ వర్షం కురుస్తుండగా ధైర్యంగా ఈ సాహస యాత్ర చేశారు సంయుక్త. ఈ సాహస యాత్రకి సంబంధించిన ఫొటోలను అభిమానుల కోసం తన సోషల్ మీడియా వేదికగా షేర్ చేశారామె. "దట్టమైన పచ్చని అడవిలో ప్రకృతి ఒడిలో ట్రెక్కింగ్ అంటే సాహసమే. పైగా వర్షం కురుస్తుండగా ట్రెక్కింగ్‌కి వెళ్లడం ఎంతో మధురానుభూతి. ఈ ట్రెక్కింగ్‌లో ఎన్నో చెప్పలేనన్ని సంతోషాలు, థ్రిల్‌కి గురిచేసే అంశాలున్నాయి. ఇలాంటి గొప్ప అనుభవాలు మీకు ఎదురయ్యాయా?" అంటూ రాసుకొచ్చారు సంయుక్త. ఇక ఆమె నటిస్తున్న తాజా సినిమాల విషయానికొస్తే... తెలుగులో 'అఖండ 2, స్వయంభు, నారీ నారీ నడుమ మురారి, విజయ్ సేతుపతి హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వం వహిస్తున్న చిత్రంలో నటిస్తున్నారు. అలాగే హిందీ, తమిళ, మలయాళ సినిమాలు చేస్తున్నారు.

# థ్రిల్లర్ జానర్‌కి సై?

'నిన్ను కోరి' (2017), 'మజిలీ' (2019), 'ఖుషి' (2023) వంటి ప్రేమకథా చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన దర్శకుడు శివ నిర్వాణ కాస్త రూట్ మార్చి ఓ థ్రిల్లర్ కథను సిద్ధం చేసుకున్నారు. ఇటీవల ఈ స్టోరీని హీరో రవితేజకు వినిపించగా ఆయన ఈ సినిమా చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారట. ఈ థ్రిల్లర్ జానర్ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనుందని ఫిల్మ్‌నగర్ సమాచారం. అయితే ప్రస్తుతం రవితేజ చేతిలో కిశోర్ తిరుమల దర్శకత్వంలోని 'అనార్కలి' (వర్కింగ్ టైటిల్), భాను భోగవరపు డైరెక్షన్‌లోని 'మాస్ జాతర' సినిమాలు ఉన్నాయి. ఈ రెండు సినిమాల చిత్రీకరణలు పూర్తయిన తర్వాత శివ నిర్వాణతో చేయాల్సిన సినిమాపై ఓ క్లారిటీ వచ్చే అవకాశం ఉంది.





# గ్యాంగ్‌స్టర్ ప్రేయసి

షాహిద్ కపూర్ హీరోగా విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో ఓ గ్యాంగ్‌స్టర్ మూవీ రానున్న సంగతి తెలిసిందే. 1990 నేపథ్యంలో ముంబై మాఫియా నేపథ్యంలో సాగే ఈ సినిమా చిత్రీకరణ త్వరలోనేప్రారంభం కానుంది. అయితే ఈ సినిమాలో మాఫియాతో పాటుగా ప్రేమ సన్నివేశాలు కూడా చాలా కీలకంగా ఉండబోతున్నాయని బాలీవుడ్ సమాచారం. ఇందుకు తగ్గట్లుగా విశాల్ భరద్వాజ్ నటీనటుల ఎంపికపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లుగా తెలుస్తోంది.ఈ సినిమాలోని హీరోయిన్స్ పాత్రల కోసం త్రిప్తి దిమ్రి, దిశా పటానీలను ఎంపిక చేసుకున్నారట మేకర్స్. షాహిద్ కపూర్, త్రిప్తి దిమ్రి జోడీగా నటించనున్నారని బాలీవుడ్ సమాచారం. అంతేకాదు... ఈ చిత్రంలోని ఇతర ప్రధాన పాత్రల్లో విక్రాంత్ మెస్సే, రణ్‌దీప్ హుడా, నానా పటేకర్, అవినాష్ తివారి నటించనున్నారని సమాచారం. షాహిద్ కపూర్, విక్రాంత్ మెస్సే, రణ్‌దీప్ హుడా వంటి పాపులర్ హీరోలు ఈ సినిమాలో భాగం కావడంతో ఈ మూవీపై అంచనాలు ఏర్పడుతున్నాయి.